నేటి మహిళ



"హల్లో..."

"హల్లో...!"

"బావగారేనా? నమస్కారాలు"

"మస్కారాలు!"

"ఇదేమిటి...? వెటకారం... బావగారెందుకో కోపంతో ఉన్నట్లున్నారు"

"అదేం లేదు కానీ విషయమేమిటో చెప్పవయ్యా మహానుభావా"

"మీ కూతురు..."

"మీ కోడలు..."

డా॥ మలయశ్రీ

అదే - నా కోడలు"

"నా కూతురు"

ఆ - నీ కూతురు, నా కోడలు... వసంత - "

"వసంతా-ఏమిటి? బాగుంది కదా. సంగతేమిటో చెప్పవయ్యా"

"బాగున్న తర్వాత బాదెక్కడిది?"

"బాగులేదా? ఏమైందయ్యా అమ్మాయికి? జ్వరమా?"

"ఇదుగో మీ చెల్లె లికిస్తున్నా ఫోను"

"అల్లో - రామ నాధం అన్నయ్యేనా?"

"ఇప్పుడు కొత్తగా రంగనాధంనైపోతానా చెల్లెమ్మా? ఏమిటమ్మా సంగతి? నీ పెనిమిటి వసంత... అని మాట ఆపేసి ఏదో విషయం నానుస్తున్నాడు".

"నా నోట ఎట్లా చెప్పేదన్నయ్యా?"

"పోనీ, నీ పెనిమిటిని చెప్పమను"

"ఆయన నోట్లో నాలుకలేని మనిసి"

నీకైతే ఉంది కదా... నువ్వే చెప్పు"

"వసంత కనిపించుతూలేదు"

"కనిపించుతూ లేదా? ఎప్పటి నుంచి"

"రొండు రోజులైంది"

"రెండు రోజులకు ఇప్పుడా చెప్పేది? ఏమైంది? ఎటు పోయింది మరి?"

"మా యింటి పక్క రవి కూడా లేడు"

"అంటే నీ ఉద్దేశం?"

"వాళ్ళు ఇద్దరూ కలిసి ఎటైనా వెళ్ళి పోయారేమో అని అనుమానం."

"నువ్వు బావగారిని లేపుకొని పోయినట్టా"

"ఏమిటా మాట? అది ఇప్పుడెందుకు? లేచి వచ్చినా పెళ్ళి చేసుకున్నాం కదా?"

"అదీ నిజమే. ఇంతకూ ఆ రవి ఎవరు? నీ పెద్ద కూతురుతో తిరిగిన కుర్రాడేనా?"

"అదేం మాట? పెళ్ళయిన పిల్ల మీద ఉత్త అభాండాలు వేయకు".

"ఉన్న సంగతే కదా అది. అందరికీ తెలిసిందేనాయె".

"అదంతా అబద్ధం. ఈ మాట వింటే దాని మొగుడు ఊకోడు".

"ఈ నువ్వన్న మాట వింటే దీని పెనిమిటి,

అదే నీ కొడుకు ఊర్కుంటాడా?"

"ఏమో - జరిగిన సంగతి చెప్పిన. మనం మనం కావల్సినోల్లం. జరుగకూడని పని జరిగింది అనే నా బాధ".

"నీకు రాకూడని కష్టం వచ్చింది".

"మాకువచ్చినా మీకు వచ్చినా ఒక్కటే కదా. మీరు వేరు, మేం వేరా? మనమంతా ఒక్కటే నాయె."

"అహా! ఎంత చక్కని మాట! నిజం చెల్లెమ్మా... నువ్వన్నమాట. ఇదుగో ఫోన్ నీ కోడలికిస్తున్న-"

"ఎవరు? వసంతా! అక్కడే ఉన్నావా బిడ్డా? కాసంత చెప్పిపోవద్దా? మీవోళ్ళను చూడాలని ఉందంటే నా కొడుకునో, మీ మామనో తోడిచ్చి పంపించకపోదుమా"

"ఎక్కడికి? పై లోకానికా?"

"అదేం మాట బిడ్డా! అట్లంటావే. ఏమైనా పీడకల కన్నావా?"

"లేదత్తా! నువ్వు మామతో మాట్లాడిందంతా విన్నానంతే. నా మొగుడు... అదే నీ కొడుకు... ఉత్త గంగిరెద్దు. అందుకే మీకు ఎవరికీ చెప్పకుండా తప్పించుకొని వచ్చేసా - రవి నాతో రాలేదు. నన్ను బస్సెక్కించి వాళ్ళ సొంతూరికి వెళ్ళాడు. కోర్టులో కలుద్దామత్తా. నాకు మొగుడూ వద్దు, మీ యిల్లూ వద్దు. నా కట్నం డబ్బుతో ఒక బిడ్డ పెళ్ళి చేసావ్. ఇప్పుడు నన్ను చంపి, కొడుకి మరో పెళ్ళి చేసి, ఆ కట్నం సొమ్ముతో మరో కూతురి లగ్నం చేయాలని చూస్తున్నావు. మూడో కుమార్తె పెళ్ళో మరి?"

"రెండో కోడల్ని చంపితే సరి" అన్నాడు తండ్రి.

"పాడు ముండ. 'నా చెల్లె. మేన సంబంధం' అని ముదనష్టపు ఇంటికి అంటగట్టాదు నా బిడ్డను" వసంత తల్లి అంది.

"నువ్వూర్కో కాస్త" రామనాథం అంటే,

"చాల్లెండి" అని కోపంగా చూస్తూ వెళ్ళిపోయింది అతని భార్య.

"అల్లో - వసంతా" అత్త పిలుపు ఫోన్‌లో.

"ఫోన్ పెట్టేస్తున్న కోర్టులో కల్సుకుందాం. నా రెండు లక్షల రూపాయలు సిద్ధంగా ఉంచుండి."

ఫోన్ పెట్టేసింది వసంత.

రామనాథం పెద్దమ్మ కూతురు వసంత అత్త. అబ్బాయి బాగున్నాడు, మంచి ఉద్యోగముంది - అని సంబంధం ఒప్పుకున్నాడు. దగ్గరి చుట్టరికం కాబట్టి కూతురు సుఖపడుతుందని అనుకున్నాడు. కాని, ఇప్పుడేమో ఇట్లాయె. అతనికి బాధగా ఉంది. వసంత తల్లి కి బాధ కోపంగా మారి భర్తపై దాడికి దిగింది.

"మనుషులను చూస్తిమి కాని, వాళ్ళ గుణాలు చూస్తిమా? మంచి కోరితే చెడు జరిగె-" తనను సమర్ధించుకున్నాడు రామ నాథం.

"అన్నీ చూసే అవుననాలయ్యా. తొందర పడితే ఇట్లాగే అవుద్ది".

"అమ్మా... మీరు ఊరుకోండి. చేసింది చాలు. ఇక నా సంగతి నేనే చూసుకుంటా-" అని లోపలికి వెళ్ళింది వసంత.

రామనాథం వీధిలోకి వెళ్ళాడు.

మళ్ళీ ఫోన్ మోగింది. తల్లి రిసీవర్ ఎత్తింది.

అవతలి వైపు మాట విని "అమ్మాయి! ఫోన్ నీకే. అల్లుడు-" అంది

"ఫోన్ పెట్టెయ్యి" అంది కూతురు.

అటు ఆ యింట్లో -

"ఏమంటుందిరా?"

"ఏమీ అనలేదు"

అతని తల్లి మళ్ళీ ఏమో అనబోయింది. కాని, అది కొడుకు వినిపించుకోలేదు. బయటకు నడిచాడు.



"ఏం చేద్దామయ్యా?"

"నేను ఏనాడైనా నీకు సలహాలు ఇచ్చానా, నువ్వు అడిగావా? ఎప్పుడూ నువ్వు చెప్పిన మాటనే వినుడాయె. ఏంచేస్తవో నువ్వే ఆలోచించుకో" అని భర్త మాట ఆపేశాడు.

అవతలి గదిలో వీరి ముగ్గురు కూతుళ్ళూ మాట్లాడుకుంటున్నారు. పెద్ద కూతురు సరోజ అత్తవారింట్లో ఉంది.

"వనజక్కా! నీ పెళ్ళికి భళే ప్లాను వేసిందే అమ్మ" అంది గిరిజ.

"వదిన చావలేదు కదా... పరిస్థితి వికటించె. ఇప్పుడెలాగా?" అంది చిన్న చెల్లి జలజ.

"అమ్మ మరో ప్లాను వేస్తుందిలే"

"ఏం ప్లాను? ఏం చేస్తుంది మళ్ళీ? మనకే విషం పెడుతుందా?"

"అంత మాటనకే. అమ్మకు మన మీద ప్రేమేనే-"

"కూతుళ్ళ మీద ప్రేముంటే అందుకు కోడళ్ళ చంపాలా? వాళ్ళూ ఓ తల్లి కన్నబిడ్డలే. తన కూతుళ్ళ వంటి వాళ్ళుకారా".

"ఎక్కడ చంపిందే? అదంతా ఉత్తది" అంది గిరిజ.

"అదేం కాదు! నిజం నేను విన్నా" జలజ.

"నువ్వే చెప్పావా వదినకు?"

"లేదు. ఆమె విన్నది"

"అబద్ధం"

"అమ్మతోడు నిజం"

"చెప్పి మంచి పని చేశావ్" అంది వనజ.

"అమ్మకు జైలు శిక్ష పడుతుందేమోనే-"

"మొదట కట్నం డబ్బు తిరిగి చెల్లించాలి కదా."

"సరోజక్క భర్తనడిగి తెస్తుందిలే"

"ఏం తెస్తుందో... వాళ్ళెందుకిస్తారు మళ్ళీ? అయినా వాళ్ళకు ఇచ్చింది లక్షే కదా. మరో లక్ష?"

"అవి అన్న పెళ్ళికే ఖర్చయ్యె"

"వదిన వాళ్ళకు కాలేదా పెళ్ళి వ్యయం?"

న్నయ్య పెళ్ళికి వదిన వాళ్ళు మనకు చీరెలు కట్నం పెట్టిరి. మల్లా ఇమ్మం ఏమోనే!"

"ఇదొకతి. ముక్కుపోగా ముక్కు పుడకకు ఎడ్చినట్లుంది దీని తీరు".

"ఇప్పుడు ముక్కు పుడకలు ఎవరూ పెట్టు కుంటూలేరు. చెవి పోగా చెవి పోగుకు ఏడ్చి నట్టు అను-"

"పోగులు కూడా పెట్టుకుంటూ లేరు తెలుసా?"

"మీరాగండే" అంది వనజ.

"ఇంతకు నీ పెళ్ళి ఎలాగే వనజక్కా?" అంది జలజ.

"మీరు నోరు మూసుకుంటారా కాస్త" ఆమె కసిరింది.

"నోరు మూసుకుంటే ప్రాబ్లం సాల్వ్‌కాదు కదా!" అంది గిరిజ.

"దానికేమిటే...? - అది రవి బావను లవ్ చేస్తోంది"

"రవి బావ సరోజక్కను కదా లవ్ చేశాడు?"

"పెద్దక్కకు పెళ్ళయింది కదా. లైన్ క్లియర్... అందుకని -"

"అంత అందంగా లేదు కదా వనజక్క?" జలజ అంది

"వ్యక్తికి అందం ఒక్కటే ముఖ్యం కాదే వెర్రి దాని -" అంది గిరిజ.

"ఏమో బాగా ముచ్చట్లు పెడుతున్నారు?" అటు వస్తూ అంది తల్లి.

"పోలీసు కేసంటే భయం వేసి..." చిన్నది అన్నది.

"ఏమిటే దొంగ చాటుగా ఫోన్ వింటున్నా రా మీరు?"

"అబ్బే, అదేం లేదమ్మా మీరు మాట్లాడు కొంటూ ఉంటే-" గొణిగింది జలజ.

"చాల్లే దొంగ మొగాలూ మీరూను" అంటూ వెళ్ళింది.

"అంతా అమ్మ పోలికే అన్నమాట మనది" మెల్లగా అంది గిరిజ.

"ఏమిటే?" తల్లి వెనుకకు తిరిగింది.

"ఏమీ లేదమ్మా - " గిరిజే అంది నాలుక కరచుకొని.

"నోర్లు మూసుకొని పడి ఉండుండి" అని తల్లి ముందుకు కదిలింది.

"నాన్నవలె!" జలజ అంది మెల్లగా, ఆ మాట తల్లికి వినరాకుండా. ఆమె లోపలికి వెళ్ళింది.

మరునాడు తమకు కావల్సిన ఒక పెద్ద మనిషిని కోడలింటికి మధ్యవర్తిగా పంపిం చింది. అతడు నానా మాటలు పడి, గోడకు విసిరిన బంతివలె తిరిగి వచ్చాడు. అవన్నీ వివ రంగా వినిపించి తానే తన చెంపలు వాయించు కొని వెనుదిరిగి చూడకుండా వెళ్ళాడు.

"ఇప్పుడేం చేద్దామయ్యా?"

"ఆలోచించు-"

"నువ్వేమంటావ్‌రా?"

"నేననేది ఏమీ లేదు"

ఆమే సలహా ఇచ్చింది భర్తకు, కొడుక్కు. తమ బంధువు ఒకాయన రాష్ట్ర మంత్రి అయి నాడు. ఆయనకు పదవిపోయినా పరపతి పోలేదు. అధికార పార్టీ ఎం.ఎల్.ఏ.గా ఉన్నా డిప్పుడు. అతని దగ్గరికి వెళ్ళమంది. వెంటనే బయల్దేరాడు భర్త.

అతడు ఏ లోకాన ఉన్నాడో - ఎంత ముట్టిందో కానీ సరే అన్నాడు.

ఫోన్‌లో మాట్లాడినాడు రామనాథంతో. "కేసు వద్దు. ఉభయులూ కూర్చుని మాటాడు

కొని, సమస్యను పరిష్కరించుకుంటే మంచి" దని సూచించాడు.

సరే - అన్నాడు రామనాథం.

అబ్బాయి వాళ్ళ ఇంట కూర్చుందాం అంటే అమ్మాయి వాళ్ళు ఒప్పుకోలేదు. అమ్మాయి వాళ్ళింటికి అబ్బాయి వాళ్ళు రామన్నారు.

మాజీమంత్రిగారింటనే ఓ దినం ఉభయులూ సమావేశమైనారు. వరుని తల్లి రానంది. వధువు తల్లి వస్తానంటే భర్త వద్ద న్నాడు. వసంత వాఙ్మాలమంతా విన్నాడు మధ్యవర్తి. తీర్పు కోసం ఎదురుచూడలేదామె. "నాకీ భర్త వద్దు. కట్నంగా తీసుకున్న డబ్బు మాది మాకు ఇస్తే చాలు. అదనంగా ఏమీ వద్దు" అన్నది స్పష్టంగా, మాజీగారి నోట మాటరాలేదు. ఓటమివేళ ఓర్మి చూపితేనే కదా గెలిచినట్టుగా గుర్తింపు? ఆయన రాజకీయ నాయకుడు. ఇటువంటివి ఎన్ని చూడలేదు? తనను ఆ యువతి లక్ష్యపెట్టనిది అతడు గుర్తించినా పట్టించుకోలేదు.

"ఏమంటావ్?" అన్నాడు అమ్మాయి తండ్రితో.

"నేను అనేదేం లేదు? అన్నాడు రామనాథం.

"మీరేమంటారయ్యా" బంధువు వైపు చూశాడు.

ఆ తండ్రి తన కొడుకు ముఖం వైపు చూశాడు.

"ఇప్పుడే వస్తాం" అని ఇద్దరూ కొంత దూరంగా వెళ్ళారు.

"ఎట్టారా?" తండ్రి.

"మీరే చెప్పండి" కొడుకు

"కోడలు మంకు పట్టు పట్టింది"

"ఆమె అన్నమాట నిజమేనా?"

"అవన్నీ ఇప్పుడెందుకు?"

"నాకు నిజం తెలువాల"

మాట మార్చి "మనింటికి రానంటున్నది" అన్నాడు.

"అంతే కదా... తనకు భర్తే వద్దని అన్నప్పుడు అత్తవారింటికి ఎలా - ఎందుకు వస్తుందింకా?"

"కట్నం డబ్బు ఇవ్వమంటుంది కదా".

"అదే కదా న్యాయం?"

"డబ్బులేదామే. అది నీ పెళ్ళికి, అక్క పెళ్ళికే ఖర్చయ్యె"

"అది మన తప్పు"

"ఏం చేద్దాంరా మరి ఇప్పుడు?"

"డబ్బయితే ఇవ్వలేం కదా"

"ఊ"

"అయితే నేనే ఆమెను బతిమిలాడి-"

"పెండ్లానికి లొంగిపోతే తలవంపులు కాదా?"

"మీకంటేనా?"

"ఇంకా ముగ్గురు ఆడపిల్లలున్నారైరి. వాళ్ళ సంగతి ఎట్లారా?"

"అది మీ బాధ్యత. పోషించలేని వాళ్ళు సంతానాన్ని కనకూడదు".

"నీ కోసం చూస్తే ఇద్దరు ఆడవాళ్ళైరి"

"కొడుకొక్కడు. వీడు చస్తే ఎట్లా? మరొక్కడైనా ఉండాలి - అని ఎదురు చూస్తే మరిద్దరూ కూతుళ్ళు అయిరి. అంతేనా"

"అదంతా మీ అమ్మ దౌర్జన్యంరా."

"నీ బలహీనత కూడా"

"ఏమంటావ్ చివరిమాట."

"అక్కడ విందురు పదండి" ఇద్దరూ కదిలారు.

"ఏం నిర్ణయం?" అన్నట్లుగా చూశారు మాజీమంత్రి.

చిన్నగా నవ్వాడు వరుడు - అదే... వసంత వద్దన్న మగడు. కొడుక్కు నవ్వెట్లా వస్తుందో ఆ తండ్రికి అర్థం కాలేదు.

"ఆమె మా యింటికి రావలసిన అవసరం లేదు".

విడిపోతరా? అనబోయి మాటాపినాడు మాజీ.

"మా ఇంటి సంగతులు ఏవీ నాకు తెలియవు. ఇన్నాళ్ళూ వాళ్ళ కొడుకుగా బతికాను. ఇక నా భార్య కోసం బతుకుతా. ఆమె ఇష్టం ఏమిటో తెలుసుకోండి."

మాజీమంత్రి వసంత దిక్కు చూశాడు. ఆమెకు భర్త ఇష్టమే అనే భావాన్ని ఆమె ముఖ వైఖరిలో గమనించాడు.

"ఎక్కడుంటాడో అడగండి. మా యింటికి వస్తాడా?" అందామె వెంటనే.

"రాను. అది నాకు అగౌరవం" అడుగక ముందే చెప్పాడు ఆమె మొగుడు.

ఈమె వారింటికి పోదు, అతడు వీరింటికి రాడు... ఇక ఈ సమస్యకు పరిష్కారం ఎట్లాగో ఆ పెద్దమనిషికి అర్థం కాలేదు. అతడు రాజకీయనాయకుడు. సమస్యలను తేల్చడం కాక, తెగకుండా నాన్చడమే కదా రాజకీయం.

భార్య భర్తవైపు చూసింది.

"వేరే ఉందాం. మనకు ఎవరి ఇల్లూ వద్దు. మనం ఇద్దరమే ఒకరికి ఒకరం తోడుగా వేరే ఇంటిలో ఉందాం" అన్నాడు ఆమె భర్త. ఆమె మనసునిండుగా నవ్వింది.

వసంత మామ దిగులుగా కనిపిస్తే తండ్రి సంతృప్తిగా కన్పించాడు. గెలుపు మాజీ మంత్రిది అయింది. అయినా ఆ జంట ఒక్కటైంది. ఆమె, ఆమె భర్తా కలిసి అటునుంచే ఎటో వెళ్ళారు. వేరు కాపురం ఏర్పాట్లు చూసు కోవడానికి కావచ్చును... ●